# అప్రయోజకుడు

డా॥ జె. వీరాస్వామి

"ఏమేవ్! అబ్బాయికి ఏం ఉద్యోగం వచ్చిందో, తెలుసా? నా కలలు ఫలించాయి. నా కష్టం గట్టెక్కింది. నా పేరు నా బిడ్డ నిలబెట్టాడు. నేను రేపటినుండి ఉత్తసూపర్వైజర్ను కాను. ఒక అసిస్టెంట్ ఇంజనీరుకు తండ్రిని. అబ్బాయి ప్రథమంలోనే అసిస్టెంట్ ఇంజనీరయ్యాడు తెలుసా? ఇప్పుడు అసిస్టెంట్ ఇంజనీర్లు, నన్ను సూపర్వైజర్గా చూడరు," అంటూ ఆనందంలో మునిగిపోయాడు.

"ఏమేవ్, అబ్బాయి నాపైన అసిస్టెంట్ ఇంజనీర్గా వస్తే, ఎంత బావుంటుందో? ఇంకొకరి దగ్గర పనిచేయటం నాకూ ఇబ్బందిగానే వుంది. అబ్బాయి దగ్గరయితే, ఎంతో హాయిగా వుంటుంది. కంట్రాక్టర్లు అందరూ హడలిపోతారు. అందరూ నాదగ్గరకువస్తారు. అయ్యో, మీ అబ్బాయిగారికి ఈ విషయం సిఫార్సు చేయండి, మీ మేలు మర్చిపోము అంటారు, నేనేం చేస్తానో తెలుసా? ఇంకా బెట్టుచేస్తాను, కొండెక్కి కూర్చుంటాను. అప్పుడందరూ బ్రతిమిలాడుతారు. అప్పుడు అబ్బాయి దగ్గరకు వెళ్తాను. అబ్బాయి రూం ముందుండే జవాను, నన్ను చూట్టంతోనే సలాంచేసి, అబ్బాయి రూంలోకి తీసుకెళ్ళుతాడు. నన్ను చూసి అబ్బాయి లేస్తాడు. అప్పుడు నేనేమంటానో తెలుసా- "అబ్బాయి! నీవు నిలువబడకూడదు. ఇక్కడ తండ్రీ కొడుకుల సంబంధం లేదు. నీవు ఇక్కడ నా అధికారిగా ప్రవర్తించాలి, ఇంటి దగ్గరనే, మనం తండ్రీ కొడుకులం" అంటాను. అప్పుడబ్బాయి ఎంతో సంతోషిస్తాడు, ఆ సంతోషంతో నేను ఎంతలా వెక్కుతానో!

అబ్బాయి ఈ కంట్రాక్టర్ మంచివాడు. అతని పని పూర్తిచేయి. ఆ కంట్రాక్టర్ చెడ్డవాడు అతన్ని దగ్గరకు రానీయకు, అని చెబితే – సరే నాన్నరు, మీ ఇష్టం అంటాడు. అట్లా కంట్రాక్టర్లంతా నా గుప్పెటలో ఉంటారు. "ఏమిటే, నేను మాట్లాడేది, వినపడుతుందా? అట్లా గుడ్లప్పగించి చూస్తావే?" అన్నాడు.

"ఏమోవ్, అబ్బాయిని, నా పై ఆఫీసర్గా వెయ్యాలనుకున్నారట. అప్పుడబ్బాయి వద్దు, అది మంచిది కాదు. నాకు జన్మనిచ్చిన నా తండ్రి నా దగ్గర తాబేదారుగా పని చెయ్యటం అన్యాయం అన్నాడట. చూశావా నేనంటే, ఎంత ప్రేమో, భక్తో! నేను అందుకు బాధపడటం లేదు. కొంతకాలం నా దగ్గర తర్ఫీదు పొందుతాడనుకున్నా. నేను ఇంతకాలం గడించిన నా అనుభవం అబ్బాయికివ్వాలి. ఎన్నో విషయాలు, రహస్యాలు నేర్పాలనుకున్నా. కంట్రాక్టర్లు మన ధనాగారమని, సూపర్వైజర్లను ఒక కంట కనిపెట్టి వుండాలని నిశ్వాస

ప్రాప్తుడైన ఒక నౌకర్ని దగ్గర పెట్టుకో వాలని చెప్పాలనుకున్నా. ఫరవాలేదులె. కాలక్రమేణా నేర్చుకుంటాడు. లేకపోతే నేనే. శెలవు పెట్టి, అంతా నేర్పుతా" అన్నాడు.

"ఏమేవ్, అబ్బాయి పనిలో ఎప్పుడు చేరితే మంచి దంటావ్, కోడలు పిల్ల ఎప్పుడొస్తోందో! అంతవరకూ వాడు ఒంటరిగా ఉండాలి. ఇంకా రెండు రోజులకు మంచి రోజు వస్తుంది. అప్పుడు చేరమని. చెప్తుతా. పోనీలే నేనేచెప్తుతా. నీపనిచూసుకో అదేమిటీ దిగులుపడుతున్నావా? అబ్బాయి. మన కెంతో దూరంలో ఉండడు. ఎప్పు డంటే అప్పుడే వెళ్ళి చూడవచ్చు. అబ్బాయి ప్రయాణానికి అన్నీ సిద్ధంచెయ్యి" అన్నాడు భార్యతో.

* * *

"ఏమేవ్ అబ్బాయి చేరిన కొద్ది రోజులకే ఎంతో పెద్దపేరు తెచ్చుకున్నాడు. వాడంటే కంట్రాక్టర్లకు హడల్, తాబేదార్లకు హడల్. కుర్చీలో కూర్చుంటే ఎవ్వరూ దగ్గరకు రారట. దూర దూరంగానే ఉంటారట. నేనే శెలవుపెట్టి వెళ్ళి వాడికి కిటుకులు నేర్పివస్తా. వాడు నా అంతటి వాడు కావద్దూ."

* * *

"ఏమేవ్, విన్నావ్ మా అసిస్టెంట్ ఇంజనీర్, శెలవుమీద వెళ్ళాడు. మన అబ్బాయికి అదనపు చార్జిఇచ్చారు. ఇప్పుడు, మన అబ్బాయి నాకు ఆఫీసర్. ఈ నెలలో అబ్బాయికి అన్ని కిటుకులు నేర్పేస్తా. మొదటే. నా కేసు పెట్టి, అంతా నేర్పుతా. అబ్బాయి రేపిక్కడే క్యాంపు. వాడికిష్టమైన వంట చెయ్యి."

* * *

"ఏమేవ్! విన్నావా! అబ్బాయి మన ఇంటికిరాడట అధికారిగావచ్చాడట, అందుకనే వసతి గృహంలో ఉంటాడట. ఒక్కసారి వచ్చి నిన్ను చూస్తాడట. ఏదయితేనేం, నా బిల్లు ఒకటి పాస్ చేయమని ఇచ్చాం. తీసుకున్నాడు. ఎంతైనా నా బిడ్డేకదూ! సాయంత్రానికి పాస్‌చేసి ఇస్తాడులే సరె పద భోం చేద్దాం!"

* * *

"ఏమేవ్, వాడు నా బిడ్డకాదు. వట్టి అప్రయోజకుడు. నా బిల్లుతో పనిచేసేచోటికి వెళ్ళాడట, ఎంత పని జరిగిందో అని తనిఖీ చేశాడట. తిరిగివచ్చి, మీరు చేసిన పని చూశాను. అసలు పనే జరగలేదు. బిల్లు ఎలా పాస్ చేసేది అన్నాడు అదేరా అబ్బాయి. కిటుకు. ఇట్లాగే నిన్నింతటివాడిని చేశాను. అన్నాను, అంతటితో. ఊరు కున్నాడా? "నేనింతటివాడినయ్యాక మీరింకా ఇటువంటి పనులు చేయటం దేనికి?" అన్నాడు. అంతటితో ఊరుకున్నాడా? ఆ పాస్ చేయని బిల్లు నా చేతిలో పెట్టి. "క్షమించండి. నాన్నారు. మీ పాత ఇంజనీరు" వస్తాడు. అతనిచేత, పాస్ చేయించుకోండి అని వెళ్ళిపోయాడు అని భార్యతో చెప్పి కుర్చీలో కూలబడ్డాడు సూపర్‌వైజరు. ★

---

# నలుగురు భార్యలు

ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు కారీగ్రాంట్‌కి ఒక కూతురు, నలుగురు పెళ్లాలు వున్నారట.

నాకు ఒక పెళ్లాం నలుగురు కూతుళ్లు వుండి వుంటే చాలా సంతోషించేవాడ్ని అన్నాట్ట. పాపం! వాళ్లు పోరు పడలేకపోతున్నాడేమో! అన్నట్టు ఆయన వయస్సు 70 సంవత్సరాలు.

—సేకరణ: వసంత.